రైతులకు అండగా 'ఈ - క్రాప్'

- పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పూర్తి నష్ట పరిహారం
- రబీ సీజన్‌లో 85 శాతం వివరాల నమోదు పూర్తి


కాగితాలపేటలో సాగు చేస్తున్న అరటి, మల్లెతోట


తాటితూరులో 'ఈ - క్రాప్' వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అసిస్టెంట్ స్వాతి

తగరపువలస : వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన తర్వాత అతివృష్టి, అనావృష్టి కారణాలతో పంట నష్టపోయిన రైతులకు 'ఈ - క్రాప్' నమోదు కొండత అండగా నిలుస్తోంది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కావడంతో భీమిలి నియోజకవర్గంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా 'ఈ - క్రాప్' నమోదు చేపట్టారు. నెల రోజులుగా ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతోంది. 'ఈ - క్రాప్'లో వివరాల నమోదు కారణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు తాము పండించిన పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి సాయం పొందడానికి అవకాశం ఉంటుంది. పంట నమోదు సర్టిఫికెట్ల ద్వారా బ్యాంకుల నుంచి రుణం పొందే అవకాశం కూడా ఉంది. పంట నష్టపరిహారం సాధారణ రైతులతోపాటు కౌలు రైతులు కూడా పొందవచ్చు.

85 శాతం నమోదు పూర్తి

భీమిలి డివిజన్‌లో రబీ సీజన్‌లో పంట విస్తీర్ణం 4,583 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 3,785 ఎకరాల్లో 'ఈ - క్రాప్' నమోదు ప్రక్రియ పూర్తి అయింది. రాష్ట్ర వ్యాప్తంగా పంటల వివరాల నమోదుకు ప్రభుత్వం ఈ నెల 22 వరకు గడువు పొడిగించింది. ఈ క్రమంలో నూరు శాతం వివరాలు నమోదు చేసేందుకు ఆర్బీకే సిబ్బంది కృషి చేస్తున్నారు.

రైతులకు ప్రభుత్వం ఆసరా

సంక్రాంతి తర్వాత నుంచి గ్రామాల్లో రబీ సీజన్ పంటల సాగు ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుంది. ప్రభుత్వం ఈ ఏడాది రబీ సాగుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చి ఆసరా కల్పించింది. సీజన్‌లో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకూ పూర్తి పరిహారం

గత ప్రభుత్వాల పాలనలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రస్తుతం కౌలు రైతులకు కూడా నష్ట పరిహారం పూర్తిస్థాయిలో అందిస్తున్నారు. గతంలో కౌలు రైతులు వ్యవసాయ భూములను లీజుకు తీసుకుని సాగు చేసినప్పటికీ నష్ట పరిహారం భూ యజమానులకే అందేది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసింది. 'ఈ - క్రాప్' వివరాలు నమోదు చేసేటప్పుడు ఆన్‌లైన్‌లో సాగు భూములను కౌలు రైతులకు ఇచ్చినట్టు చూపిస్తున్నారు. దీంతో కౌలు రైతుల పేరు మీదే 'ఈ - క్రాప్' వివరాలు నమోదవుతున్నాయి. దీని వల్ల పంట నష్టపరిహారం నేరుగా కౌలు రైతులకు చేరుతుంది. ప్రస్తుత రబీ సీజన్‌లో చేపట్టిన వివరాల నమోదుతో కౌలు రైతులకు వ్యవసాయశాఖ జారీ చేసే 'ఈ - క్రాప్' బుకింగ్ సర్టిఫికెట్లతో బ్యాంకులు కొత్తగా పంట రుణాల మంజూరు చేయడంతోపాటు పాత రుణాలు రెన్యువల్ చేస్తున్నాయి.

అన్నదాతలకు ఇవీ ప్రయోజనాలు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట సాగు చేసిన రైతులకు నేరుగా నష్టపరిహారం అందుతుంది. దళారీల చేతికి బీమా పరిహారం అందదు. రైతుల తరపున ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుంది. 'ఈ - క్రాప్' ద్వారా రైతులు నష్టపోయిన పంట వివరాలు, సాగు వివరాలు తెలుస్తాయి. పంటల మార్పిడికి, పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల దిగుబడిపై స్పష్టత వస్తుంది. ఎరువులు, పురుగు మందుల అవసరం రైతు భరోసా కేంద్రాల ద్వారా తెలుసుకోవచ్చు.

రైతులకు ప్రయోజనకరం



'ఈ - క్రాప్'లో వివరాల నమోదు రైతులకు ఎంతో లాభదాయకం. ప్రభుత్వమే రైతుల తరపున బీమా చెల్లిస్తుంది. పంటలు నష్టపోతే ఎవరి చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించి ఆదుకుంటుంది.

– ఆకిరి సూర్యనారాయణ, రైతు

సద్వినియోగం చేసుకుంటున్నాం



ఈ - క్రాప్ నమోదు లాభాలు సద్వినియోగం చేసుకుంటున్నాం. దీనివల్ల పెట్టుబడి సాయం, నష్ట పరిహారం అందుతున్నాయి. కౌలు రైతులను కూడా సాధారణ రైతులతో సమానంగా ప్రభుత్వం ఆదుకుంటోంది.

– బత్తుల సూర్యారావు, రైతు

కౌలు రైతులకు న్యాయం



గతంలో ఏ ప్రభుత్వామూ కౌలు రైతులకు న్యాయం చేయలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ద్వారా మాత్రమే కౌలు రైతులకు న్యాయం జరుగుతుంది. పంటనష్టం నేరుగా కౌలు రైతులకు అందిస్తున్నారు.

– నాగిరెడ్డి నారాయణరావు, రైతు

సింహగిరిపై త్వరలో సహస్ర దీపాలంకరణ సేవ

- రూ.10 లక్షలతో కేంద్రం ఏర్పాటు
- భూమి పూజ నిర్వహించిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు


భూమి పూజ చేస్తున్న వైదికులు, ట్రస్టుబోర్డు సభ్యులు

సింహాచలం : సింహగిరిపై త్వరలో సహస్రదీపాలంకరణ సేవను పునరుద్ధరించనున్నారు. ప్రత్యేకంగా రూ.10లక్షలతో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు శనివారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, వైదికులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు. అలాగే స్వామివారి తిరువీధి వాహనాలు ఉంచేందుకు మరో రూ.10లక్షలతో వాహనశాల ఏర్పాటు పనులకు కూడా భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు మాట్లాడుతూ సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులతో పాటు, స్వామి సేవలకు సంబంధించిన పనులకు చేపట్టనున్నామన్నారు. గతంలో ప్రతీ శనివారం సాయంత్రం ఆలయ ఆస్థానమండపంలో సహస్ర దీపాలంకరణ సేవ ఉండేదని గుర్తుచేశారు. ఆసేవను మరింత వైభవంగా నిర్వహించేందుగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. త్వరలోనే రూ.54 కోట్లతో ప్రసాద్ స్కీమ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మించిన కల్యాణమండపాలను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, దేవస్థానవం ప్రధాన పురోహితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో నరసింగరావు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన అవసరం

కొమ్మాది: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన అవసరమని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వైజాగ్ పారామౌంట్ అధ్యక్షుడు బి.చైతన్య రాజీవ్ అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంద మంది విద్యార్థులకు సాధారణ, ఆరోగ్య, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వి డెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కేఎమ్‌కే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన

భీమునిపట్నం: తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఎప్పటి నుంచో డీఏలు, ఇతర బకాయిలు అందడం లేదని, వాటిని విడుదల చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఆయా శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డులు అన్ని ఆస్పత్రుల్లో పనిచేసేలా చూడాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. కె.సాయిబాబా, ఎం.లోవరాజు, కె.ముత్యాలరావు, ఎం.ఆనందరావు, టి.భీమారావు, కోటేశ్వరరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక నేడు

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత శ్రీనూకాలమ్మ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోనున్నారు. ప్రతీ సంవత్సరం ఉగాది పర్వదినం సమయంలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి ఉత్సవాల నిర్వహణ కమిటీని ఎన్నుకుని కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈసారి ఏప్రిల్ నెలలో ఉత్సవాలు జరగనుండగా, నిర్వహణకు కమిటీని నూకాలమ్మ ఆలయం వద్ద ఎన్నుకోనున్నారు.

విదేశీ విద్యార్థుల సందడి


ఆకట్టుకున్న విదేశీ విద్యార్థుల నృత్యం

కొమ్మాది : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న వివిధ దేశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజనోత్సవం సంయుక్త – 24 శనివారం ఉత్సాహంగా సాగింది. వివిధ విద్యా సంస్థల నుంచి హాజరైన విదేశీ విద్యార్థులు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. నేపాల్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ తదితర దేశాల విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

జిల్లా స్థాయి 'ఇన్‌స్పైర్'కు ఎంపిక


అనూషను అభినందిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు

భీమునిపట్నం : స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న మండల అనూష జిల్లా స్థాయిలో నిర్వహించే ఇన్‌స్పైర్‌కు ఎంపికైంది. సైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులను అనూష రూపొందించగా, అవి ఎంపిక కావడంతో ఈ మేరకు ఎంపిక చేశారు. త్వరలో నగదు బహుమతి అందిస్తారు. విద్యార్థినిని సమగ్రశిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది శనివారం అభినందించారు.

పార్కులో విద్యుత్ కాంతులు


కొత్తగా ఏర్పాటు చేసిన లైట్ల వెలుగులో జమ్మిచెరువు పార్కు

- రూ.80 లక్షలతో జమ్మిచెరువు పార్కు అభివృద్ధి
- రూ.18 లక్షలతో అధునాతన లైట్ల ఏర్పాటు

భీమునిపట్నం : భీమిలి చిన్నబజారు ప్రాంతంలోని జమ్మిచెరువు పార్కులో అధికారులు లైట్లు ఏర్పాటు చేయడంతో ఒక్కసారిగా ఆ పరిసరాలు మెరిసిపోతూ కొత్త అందాలు సంతరించుకున్నాయి. విశాలమైన స్థలంలో ఉన్న ఈ పార్కులో పిల్లలు ఆడుకునే సామగ్రి, వాకింగ్ ట్రాక్ సదుపాయం ఉన్నాయి. దీంతో రోజూ పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. అయితే గతంలో సరైన సదుపాయాలు లేక ఇక్కడకు వచ్చేవారు ఇబ్బందిపడేవారు. లైటింగ్ లేకపోవడంతో సాయంత్రమయ్యేసరికి అందరూ పార్కు నుంచి వెళ్లిపోవాల్సిన పరిస్థితి వుండేది. అయినప్పటికీ గత పాలకులు ఎంతమాత్రమూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించిన వెంటనే రూ. 80 లక్షలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో ఇక్కడి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, రక్షణ కంచె, పిల్లలు ఆడుకునే క్రీడా వస్తువులతోపాటు అవసరమైన ఇతర పనులను పూర్తి చేశారు. తాజాగా పార్కులో రూ.18 లక్షలతో అధునాతమైన 44 లైట్లు ఏర్పాటు చేశారు. వీటిని ఇటీవల ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రాంభించారు. సాయంత్రం ఆరు తర్వాత చీకట్లో అంధకారంలో మగ్గిపోయే పార్కు ప్రస్తుతం లైట్ల వెలుగులో మెరిసిపోవడంతో... ప్రభుత్వ పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ కాలనీ ఇళ్లు

- పెండింగ్ జాబితాల పరిష్కారానికి చర్యలు
- భూములు లేనిచోట స్థల సేకరణ
- జేసీ మయూర్ అశోక్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సమీక్షలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలో అర్హులందరికీ కాలనీ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జేసీ మయూర్ అశోక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో గృహ నిర్మాణ శాఖపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గల కాలనీ ఇళ్ల సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. లబ్ధిదారులు చేసుకున్న ప్రతి దరఖాస్తు పరిశీలించి, అర్హులందరికీ ఇళ్లు అందిస్తామని, అవసరమైన చోట స్థలాలు సేకరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పం వల్ల నియోజకవర్గంలో 25 వేల మందికి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయగలిగామని చెప్పారు. ఇంకా కొంత మందికి అర్హత ఉన్నా సాంకేతిక కారణాల వల్ల ఇళ్ల మంజూరుకు ఆటంకాలు ఏర్పడ్డాయని, వాటిని పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. పలు గ్రామాల్లో స్థలాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని, అలాంటి చోట భూసేకరణ చేస్తామని వెల్లడించారు. మూడు మండలాల్లోని పలు గ్రామాల్లో కోర్టు కేసుల వల్ల ఇళ్ల స్థలాలు అప్పగించడానికి ఆటంకం ఏర్పడిందన్నారు. వాటిని పరిష్కరించడానికి ప్రత్యేక అధికారుల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అర్హత గల వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి కాలనీ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి, పద్మనాభం ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, నాయకులు మజ్జి వెంకటరావు, బంక సత్యం, జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా యోగా థీమ్ పార్కు

- రూ.1.92 కోట్లతో వంద రోజుల్లోనే నిర్మాణం
- అమితానందం వ్యక్తం చేస్తున్న స్థానికులు


పార్కులో పచ్చదనం


యోగా థీమ్ పార్కులో వాకింగ్ ట్రాక్

పీఎం పాలెం : జీవీఎంసీ పార్కులు అంటే తుప్పలు, డొంకలు పెరిగిపోయి నిర్మానుష్యంగా... ఆకతాయిలకు నిలయంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వుండేవి. గత పాలకుల నిర్లక్ష్యంతో అన్ని పార్కుల్లోనూ అదే పరిస్థితి వుండేది. ఇదంతా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పాలన ప్రారంభం కాకముందు పరిస్థితి. ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక పార్కుల రూపురేఖలే మారిపోయాయి. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా పాతవి అభివృద్ధి చేయడంతో పాటు కొత్త పార్కుల నిర్మాణానికి స్థలాలు, నిధులు కేటాయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా పీఎం పాలెంలోని పార్కుల్లో వసతుల కల్పన, సుందరీకరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. వివిధ కాలనీల్లోని స్థానికులు సేద తీరడానికి, పిలల ఆటపాటల నిమిత్తం చూడముచ్చగా అభివృద్ధి చేశారు. ఆక్రమణలకు గురికాకుండా కంచె కూడా ఏర్పాటు చేశారు.

ఎన్నికల హామీ నెరవేర్చి...

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు పరచడంలో భాగంగా పార్కుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చారు. పీఎం పాలెం షిప్‌యార్డు లే అవుట్‌లోని పార్కు స్థలం గతంలో ఆక్రమణకు గురై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక ప్రత్యేక చొరవతో ఆ స్థలంలోని ఆక్రమణలు తొలగింపజేసి రూ.1.92 కోట్లతో వంద రోజుల్లోనే యోగా థీమ్ పార్కును సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు. ఇక్కడ వాకర్స్ కోసం ప్రత్యేకంగా ట్రాక్ నిర్మించారు. యోగా, మెడిటేషన్ చేసుకునే వారి కోసం విశాలమైన ప్లాట్‌ఫారం నిర్మించారు. బాలలకు ప్రత్యేక ఆటల ఉపకరణాలు, ఊయలలు ఏర్పాటు చేశారు. ఆటపాటల కోసం మినీ బహిరంగ వేదిక నిర్మించారు. పార్కు మొత్తం పచ్చదనం ఏర్పాటు చేశారు. అందమైన పార్కులో స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో హాయిగా సేద తీరుతున్నారు. బాలలు, స్త్రీలు, వృద్ధులు, యువకులు పార్కులో విహరిస్తూ అమితానందం పొందుతున్నారు.


రాత్రి వేళ విద్యుత్ దీపాల వెలుగులో పార్కు అందాలు

ఎన్నడూ ఊహించలేదు



మా కాలనీలో ఇంత అందమైన, అద్భుతమైన పార్కు అందుబాటులోకి వస్తుందని ఎన్నడూ ఊహించలేదు. విశాలమైన పార్కులో విహరించడం, అందులో రాత్రి వేళ విద్యుత్ దీపాల వెలుగులో సేదతీరడం మధురానుభూతిని ఇస్తోంది. కొన్ని నెలల కిందట ఇటువైపునకు రావడానికే భయపడే ప్రదేశంలో అందమైన పార్కు నిర్మించడం చాలా ఆనందగా ఉంది.

– మాధవి, షిప్‌యార్డు లే అవుట్, పీఎం పాలెం.

కాలనీలో అద్భుత పార్కు



సామాన్య, మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉన్న ఈ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా పార్కు సదుపాయం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో విహరించడానికి, సేద తీరడానికి అనువైన ప్రదేశం లేకపోవడంతో అదో పెద్ద లోటుగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. అన్ని హంగులతో అద్భుతమైన పార్కు అందబాటులోకి వచ్చింది. చాలా ఆనందంగా ఉంది.

– ఎస్.విశ్వేశ్వరరావు, షిప్‌యార్డు లే అవుట్, పీఎం పాలెం.

సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు


సంతపేటలో నాసిరకంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుంటే... కాంట్రాక్టర్లు మాత్రం నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేస్తున్నారు. రెండు రోజులుగా సంతపేట రెడ్డివీధిలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డే ఇందుకు తార్కాణం. వాటం చూడకుండా ఎగుడుదిగుడుగా నిర్మిస్తున్న రోడ్డుపై నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా రహదారికి ఇరువైపులా ప్రజలు జుత్తులు పట్టుకుంటున్నారు. గతంలో ఈ మార్గంలో నిర్మించిన డ్రైనేజీ కూడా నాణ్యత లేకపోవడం, అడుగు భాగం ఊడ్చకపోవడంతో మురుగునీరు ప్రవహించినప్పటికీ ఎక్కడపడితే అక్కడ చెత్త నిలిచిపోయి పురుగులు పడుతున్నాయి. ఇప్పుడు సీసీ రోడ్డు కూడా లోపభూయిష్టంగా నిర్మిస్తున్నారు. పని ప్రదేశంలో జీవీఎంసీ ఇంజినీరు, వర్క్ ఇన్‌స్పెక్టర్, కనీసం కాంట్రాక్టర్ లేకపోవడంతో పనివారు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిపై జీవీఎంసీ దృష్టి సారించి నాసిరకం పనులు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాంబాబుకు అభినందనలు


మెడల్ అందుకుంటున్న రాంబాబు

పద్మనాభం : పూణే మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూణేలో జరుగుతున్న 44వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో అనంతవరానికి చెందిన కె.రాంబాబుకు శనివారం మరో మెడల్ అభించించింది. దీంతో పలువురు రాంబాబుకు అభినందనలు తెలిపారు. రాంబాబు సింహాచలం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇవే పోటీల్లో ఇటీవల రెండు మెడల్స్ లభించాయి. ఇప్పుడు 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ లభించింది. మాస్టర్ అథ్లెటిక్ ఫెడరేషన్ ఇండియా జనరల్ సెక్రటరీ రామప్రసాద్ చేతుల మీదుగా రాంబాబు మెడల్ అందుకున్నారు.

వెలగని విద్యుత్ దీపం


సంతపేటలో వెలగని దీపం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేటలో 96 ఏ3 విద్యుత్ స్తంభం వద్ద దీపం వెలగకపోడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కుమ్మరివీధికి వెళ్లే ఈ మార్గంలో చీకటి కారణంగా విష పురుగులు, వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ స్తంభానికి వీధిదీపం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.